

నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం తిమ్మారెడ్డిపల్లి తండాలోని కాటన్ మిల్లు ఎదుట జాతీయ రహదారిపై బైఠాయించిన పత్తి రైతులు

# పత్తి రైతుల ఆందోళన

- మద్దతు ధర చెల్లించాలని డిమాండ్
- తిమ్మారెడ్డిపల్లి తండాలోని మిల్లు వద్ద నిరసన
- గంటపాటు రోడ్డుపై బైఠాయింపు

ఊట్కూర్, అక్టోబర్ 26 : పత్తికి మద్దతు ధర చెల్లించాలని రైతులు ఆందోళనకు దిగారు. నాణ్యత, తేమ శాతం పేరిట కాటన్‌మిల్లు యజమానులు ధరను తగ్గించారంటూ శనివారం నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలం తిమ్మారెడ్డిపల్లి తండాలోని మారుతీ కాటన్ ఇండస్ట్రీస్ ఎదుట నారాయణపేట– హైదరాబాద్ జాతీయ రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. మిల్లుకు భారీగా పత్తి రావడంతో యజమానులు ధర తగ్గిస్తున్నారని మండిపడ్డారు. శనివారం ఉదయం 9 గంటలకు వ్యాపారులు కొనుగోలు ప్రారంభించి.. క్వింటాకు గరిష్ఠంగా రూ.7,100 ప్రకటించినట్టు తెలిపారు. వారం రోజులుగా రూ.7,300 పలికిన ధర ఇప్పటికిప్పుడు ఎందుకు తగ్గించారంటూ మిల్లు యజమానులను నిలదీశారు. వ్యాపారులు కుమ్మక్కై రైతులను దోపిడీ చేస్తుంటే అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. గంటపాటు ధర్నా చేయడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న డీఏవో జాన్‌సుధాకర్, నారాయణపేట సీఐ శివశంకర్ అక్కడికి చేరుకొని యజమానులు, రైతులతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు.

## నాలుగెకరాల్లో పత్తిని పీకేసిన రైతు

- గత నెల వర్షాలతో పెన్‌గంగలో మునిగిన చేను
- మద్దతు ధర వచ్చే అవకాశం లేకపోవడంతో మనస్తాపం

తాంసి, అక్టోబర్ 26 : ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని అర్లి(టీ) గ్రామానికి చెందిన రైతు గుమ్ముల వెంకటి నాలుగెకరాల్లో పత్తి వేశాడు. రూ.60 వేలు పెట్టుబడి పెట్టాడు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన వర్షానికి పెన్‌గంగా ఉప్పొంగి రెండెకరాల పత్తి నీట మునిగింది. దీనికి సంబంధించి రూ.30 వేల పరిహారం వచ్చింది. పెన్‌గంగలో మునిగిన పత్తి దిగుబడి రాదని, మరో రెండెకరాల పత్తికి ధర వచ్చే అవకాశం లేదని మనస్తాపం చెందాడు. దీంతో శనివారం సాయంత్రం మొత్తం నాలుగెకరాల్లో పత్తిని పీకేశాడు.



పత్తి మొక్కలను పీకేస్తున్న రైతు వెంకటి

## మిల్లర్లకున్న సోయి..

# సర్కారుకు లేకపాయే

- కేంద్ర ప్రభుత్వానికి కాటన్ మిల్లర్ల లేఖ
- తేమశాతం 15 నుంచి 18కి పెంచాలని విజ్ఞప్తి
- పత్తి రైతుల గోసను పట్టించుకోని ప్రభుత్వం
- తేమ ఎక్కువుందని కొనుగోలుకు సీసీఐ ససేమిరా
- ప్రైవేటు వైపు అన్నదాతల మొగ్గు
- మద్దతు ధర దక్కక రైతులకు నష్టం
- కాంగ్రెస్ సర్కారు తీరుపై పత్తి రైతుల ఆగ్రహం



హైదరాబాద్, అక్టోబర్ 26(నమస్తే తెలంగాణ): పత్తి రైతుల గోసపై ప్రైవేటు కాటన్ మిల్లర్లకున్న సోయి ప్రభుత్వానికి లేకుండాపోయింది. మద్దతు ధర దక్కక పత్తి రైతుల గోస చూసి ప్రైవేటు వ్యాపారులే చలించిపోయారు. వారికి మద్దతు ధర దక్కేలా చేయాలని కేంద్రానికి విన్నవించారు. ఇందుకోసం తేమ శాతం నిబంధనలను సవరించాలని కోరారు. వాస్తవానికి ప్రభుత్వం, మార్కెటింగ్ శాఖ ఈ పని చేయాలి. కానీ కాంగ్రెస్ సర్కారు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నది. పత్తి రైతులకు మద్దతు ధర దక్కేలా చేయడంలో మార్కెటింగ్ శాఖ పూర్తిగా విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. క్వింటాలు మద్దతు ధర రూ. 7521 ఉండగా ప్రైవేటు వ్యాపారులు రూ. 5500 నుంచి రూ. 6500లకే కొనుగోలు చేస్తున్నారు.

**తేమ శాతం 12 నుంచి 18కి పెంచండి...**

మార్కెట్లో పత్తి ధర పతనమవడం, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) తేమ పేరుతో కొనుగోలుకు నిరాకరించడంపై రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో రైతుల గోసను చూసిన కాటన్ మిల్లర్లు చలించిపోయారు. తేమ శాతం కొర్రీలపై రెండు రోజుల క్రితం కేంద్రానికే లేఖ రాశారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం పత్తిలో తేమ శాతం 8–12 వరకు ఉండాలి. అలా అయితేనే సీసీఐ కొనుగోలు చేస్తుంది. రైతులకు నష్టం జరుగుతున్న దృష్ట్యా తేమ శాతాన్ని పెంచాలని కోరుతూ కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు లేఖ రాశారు. తేమ శాతాన్ని 12 కాకుండా 15 నుంచి 18 వరకు పెంచాలని కోరారు. తద్వారా రైతులకు మేలు జరుగుతుందని సూచించారు. రాష్ట్రంలో తీవ్ర వర్షాలతో పత్తిలో తేమ శాతం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. ఒకవేళ ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే సీజన్‌లో పత్తి సాగుపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. నాణ్యమైన పత్తిని అందించే తెలంగాణలో పత్తి సాగు తగ్గితే అది దేశానికే నష్టమని పేర్కొన్నారు. కాబట్టి రైతులకు నష్టం జరగకుండా తేమశాతాన్ని పెంచి మద్దతు ధరకు సీసీఐ ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో సర్కారు తీరుపై పత్తి రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మద్దతు ధర దక్కక తామంతా నష్టపోతుంటే పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కన్నా మిల్లర్లే నయమని విమర్శలు గుప్పిస్తున్నారు.

## తేమ ఎక్కువున్నా పత్తి కొనుగోలు

**వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల**

హైదరాబాద్, అక్టోబర్ 26(నమస్తే తెలంగాణ): పత్తిలో నిర్ణీత ప్రమాణాల కన్నా తేమ శాతం ఎక్కువ ఉన్నా సీసీఐ ద్వారా మద్దతు ధరతో కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఈ విషయంపై సీసీఐ సీఎండీ, సీసీఐ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. శనివారం పంట ఉత్పత్తుల కొనుగోళ్లపై సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. మార్క్‌ఫెడ్ అధికారులతో వానకాలం కొనుగోళ్లపై ఆరా తీశారు. మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్‌రావు పెసర, సోయాబిన్ కొనుగోళ్లు తుది దశకు చేరాయని మంత్రికి వివరించారు.

## రైతుపై ఏఎస్సై దౌర్జన్యం

- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- ఉన్నాతాధికారుల విచారణ



రైతుపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న ఏఎస్సై

మునుగోడు, అక్టోబర్ 26: నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రానికి చెందిన రైతుపై ఓ ఏఎస్సై దౌర్జన్యం చేశారు. సంబంధించిన వీడియో శనివారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మునుగోడుకు చెందిన కొమ్ము ముత్యాలుకు, పక్క భూమి రైతుతో గెట్ల హద్దుల వివాదం నడుస్తున్నది. ఈ విషయంలో ఇద్దరూ గత నెల 30న గొడవపడగా, ము త్యాలుపై సదరు రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మునుగోడు ఏఎస్సై కోటిసింగ్, ముత్యాలుకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దాంతో ఆవేశానికి గురైన ఏఎస్సై.. తన ఫోన్ ఎందుకు లిఫ్టు చేయలేదని ప్రశ్నించారు. పొలం పనుల్లో ఉండి ఫోన్ చూడలేదని చెప్పినా వినకుండా ఏఎస్సై తనను కొట్టాడని బాధిత రైతు ఈ నెల 17న ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. ఎస్సై వెంకటేశ్వర్లును వివరణ కోరగా.. చండూరు సీఐ వెంకటయ్య విచారణ చేసి నివేదిక అందించినట్టు తెలిపారు.

## వర్గీకరణ కాదంటే సర్కార్‌పై యుద్ధమే

**ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ**



న్యూశాయంపేట, అక్టోబర్ 26: ఎస్సీ వర్గీకరణను అమలు చేయకపోతే రేవంత్ రెడ్డి సర్కార్‌తో యుద్ధాన్ని కొనసాగిస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే అసెంబ్లీ సాక్షిగా దేశంలో తామే మొదట వర్గీకరణ అమలు చేస్తామని, అన్ని నోటిఫికేషన్లకు వర్తించేలా ఆర్డినెన్స్ తెస్తామని మోసపూరిత మాటలు చెప్పిన సీఎం.. ఎస్సీ వర్గీకరణ లేకుండానే ఉద్యోగాలను భర్తీ చేస్తూ నమ్మకద్రోహం చేస్తున్నాడని మండిపడ్డారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని డీ–కన్వెన్షన్ హాల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా మాదిగల ధర్మ యుద్ధ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డిని నమ్మితే ఎంత మోసం చేస్తాడో టీచర్ల ఉద్యోగాల నియామకాలతో తేలిపోయిందని అన్నారు. 11 వేలకుపైగా ఉద్యోగాల్లో ఎస్సీ వర్గీకరణ లేకపోవడం వల్ల మాదిగ, మాదిగ ఉప కులాలు తీవ్రంగా నష్టపోయాయని, మళ్లీ గ్రూపు–1,2,3,4, వివిధ విభాగాల్లో ఉద్యోగాలను కూడా దక్కకుండా రేవంత్‌రెడ్డి కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు.

# పంచాయతీకి ఉరి!

మొదటిపేజీ తరువాయి...

వస్తుంది. వారి జేబులకు చిల్లు పడుతుంది. ఇదే సమయంలో ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుంది. అంటే సర్కారు తన ఖజానాను నింపుకోవడానికి ప్రజలపై అదనపు పన్నుల భారం మోపనున్నదన్నమాట. పైగా ఇప్పటివరకు ఊర్లో ఉన్న పంచాయతీ కార్యాలయానికి వెళ్తే పనులు జరిగేవి. కానీ ఇప్పుడు జిల్లాకు ఒకటో.. రెండో ఏర్పాటయ్యే అథారిటీ ఆఫీసుల చుట్టూ తిరిగేందుకు అదనపు సమయం, భారం మోయాల్సి వస్తుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఏ రకంగా చూసినా ప్రజల నడ్డి విరవడం ఖాయమని, పల్లెలను మరింత సంక్షోభంలోకి నెడుతుందని చెప్తున్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**నిధులు లేక మూలుగుతున్న పల్లెలు..**

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలకు ప్రతినెల రూ.275 కోట్ల చొప్పున ఏటా రూ.3,300 కోట్ల వరకు టంచనుగా నిధులు విడుదల చేసేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పల్లెలపై కక్ష కట్టింది. పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవడంతో కనీసం ట్రాక్టర్ డీజిల్, బ్లీచింగ్ పౌడర్ కూడా కొనలేని దుస్థితి నెలకొన్నది. కేంద్రం నుంచి వివిధ పథకాల కింద వచ్చిన రూ.2,100 కోట్ల నిధులను సైతం రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. 15వ ఆర్థిక సంఘం నుంచి వచ్చిన రూ.500 కోట్లను పంచాయతీలకు ఇవ్వకుండా ఆపారని చెప్తున్నారు. పారిశుద్ధ్య పనులు కూడా చేయకపోవడంతో దోమలు, ఇతర కీటకాల సంఖ్య పెరిగి సీజనల్ వ్యాధు లు విజృంభించాయి. మాజీ ఎంపీటీసీలు, జడ్పీటీసీలు తమకు గౌరవ వేతనం కూడా రాలేదని మొత్తుకున్నారు. బిల్లులు పెండింగ్ పెట్టడంతో మాజీ సర్పంచులు లబోదిబోమంటున్నారు. లక్షలు ఖర్చు పెట్టి పనులు చేయించి అప్పులపాలు అయ్యామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే నెల 4న చలో హైదరాబాద్ కూడా ప్రకటించారు. ఇలా పంచాయతీలు కునారిల్లుతున్న తరుణంలో ప్రభుత్వం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు అప్పగించడం ద్వారా పల్లెలకు ఉరివేస్తున్నదని విమర్శిస్తున్నారు.

## నారాయణపేటకు అభివృద్ధి అథారిటీ

- 245 గ్రామాలు, 3 మున్సిపాలిటీలతో ఏర్పాటు
- మున్సిపాలిటీగా మద్దూరు

నారాయణపేట, అక్టోబర్ 26: కొత్తగా నారాయణపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) ఏర్పాటైంది. పేట జిల్లా పరిధిలోని నారాయణపేట, కోస్గి, మక్తల్ మున్సిపాలిటీలతోపాటు జిల్లాలోని 245 గ్రామాలతో కలిపి నుడాను ఏర్పాటు చేస్తూ మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ శనివారం జీవో జారీ చేశారు. దామరగిద్ద మండలంలోని 27 గ్రామాలు, ధన్వాడలో 9, గుండుమాల్‌లో 10 , కోస్గిలో 15, కొత్తపల్లిలో 11, కృష్ణలో 14, మద్దూరులో 17, మాగనూర్‌లో 20, మక్తల్‌లో 37, మరికల్‌లో 14, నారాయణపేటలో 24, నర్వలో 20, ఉట్కూర్ మండలంలోని 27 గ్రామాలతో నుడా ఏర్పాటు కానున్నది. మొత్తం 280 పంచాయతీలు ఉండగా 245 జీపీలకు నుడాలో చోటు దక్కింది. అలాగే మద్దూరుతోపాటు సమీప 8 జీపీలను విలీనం చేసి.. మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నది.

# ఫీజు బకాయిలు విడుదల చేయాలి

- బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో 'ముఖ్యమంత్రికి పోస్ట్‌కార్డులు'



ముఖ్యమంత్రికి రాసిన పోస్ట్‌కార్డులతో విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 26: రాష్ట్రప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. బకాయిలను విడుదల చేయకపోవడంతో కళాశాలలు మూతపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో విద్యార్థుల చదువు అటకెక్కుతున్నదని వాపోయారు. బకాయిలను తక్షణమే విడుదల చేయాలని 'ముఖ్యమంత్రికి పోస్ట్‌కార్డులు' ఉద్యమాన్ని బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. హబ్సిగూడలోని ఒమేగా కళాశాల విద్యార్థులు ముఖ్యమంత్రికి పోస్టు కార్డులు పంపించారు. ఈ సందర్భంగా శ్రీను నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలలో యువ వికాస్ పథకం ద్వారా రూ. 5లక్షల విద్యార్థి భరోసా కార్డు ఇస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా విద్యార్థులకు ఇవ్వాల్సిన రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను సైతం చెల్లించడం లేదని దుయ్యబట్టారు. తక్షణమే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**రీయింబర్స్‌మెంట్‌కు కాంగ్రెస్ సర్కార్ తూట్లు**





బీఆర్‌కే భవన్ వద్ద విద్యార్థులను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

హైదరాబాద్, అక్టోబర్ 26(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ తెచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీంకు ప్రస్తుత కాంగ్రెస్ సర్కారే తూట్లు పొడుస్తున్నదని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఒకే విడతలో రీయింబర్స్‌మెంట్ ఇస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు చేస్తున్నదేంటి? అని నిలదీశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని శనివారం విద్యార్థులతో కలిసి ఏఐఎస్‌ఎఫ్ జీహెచ్‌ఎంసీ ఆఫీసు నుంచి ర్యాలీగా బయల్దేరగా, బీఆర్‌కే భవన్ వద్ద పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొన్నది. ఆందోళన చేస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు స్టాలిన్, రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ రూ.7650 కోట్ల ఫీజు బకాయిలు రాకపోవడంతో పేద విద్యార్థులు చదువులు కొనసాగించలేని పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## పదవీ విరమణ బెనిఫిట్స్ ఇవ్వండి

**సర్కారుకు అంగన్‌వాడీ టీచర్ల విజ్ఞప్తి**

హైదరాబాద్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుంది. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 65 ఏండ్లు దాటిన టీచర్లను ఉద్యోగం నుంచి తొలిగించారు. అయినప్పటికీ వారికి రావాల్సిన బెనిఫిట్స్ మాత్రం ఇప్పటివరకు ఇవ్వలేదు. ఈ విషయంపై అంగన్‌వాడీ టీచర్ల సంఘం నాయకురాలు నల్లభారతి తీవ్రంగా మండిపడ్డారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్ కింద టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాకు రూ. లక్ష కూడా ఇస్తామని హామీ ఇచ్చి, ఇంతవరకు అమలు చేయడం లేదని వాపోయారు. ప్రస్తుతం 35, 700 అంగన్‌వాడీలలో పనిచేస్తున్న సిబ్బంది పదవీ విరమణ పొందడంతో ఐదు వేలకు పైగా టీచర్లు, ఆయాలు తగ్గిపోయారు. దీంతో ఆయా కేంద్రాల నిర్వహణ కష్టంగా మారింది. తమ డిమాండ్ల పరిష్కారానికి మంత్రులు, అధికారుల చుట్టు తిరిగినప్పటికీ ప్రయోజనం లేదని అంగన్‌వాడీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రామాణిక పద్ధతులు పాటించాలి

- కులగణనకు డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాలి
- పబ్లిక్ హియరింగ్‌లో వక్తలు, కుల సంఘాల ప్రతినిధుల డిమాండ్



పబ్లిక్ హియరింగ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు, కులసంఘాల ప్రతినిధులు

హైదరాబాద్, అక్టోబర్26 (నమస్తే తెలంగాణ): స్వయంప్రతిపత్తి కలిగిన డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసి, ప్రామాణిక పద్ధతులతోనే కుల సర్వేను నిర్వహించాలని, లేదంటే న్యాయపరమైన వివాదాలు తప్పవని కులసంఘాల ప్రతినిధులు, న్యాయకోవిదులు హెచ్చరించారు. కులసర్వే ప్రశ్నావళి, అందులో చేర్చాల్సిన అంశాలపై అఖిలపక్షంతో చర్చించాకే ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'కులగణన'లో సవాళ్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అభిప్రాయాల సేకరణ తదితర అంశాలపై పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సెస్, తెలంగాణ బీసీ ఉద్యోగుల ఫెడరేషన్ సంయుక్తంగా పబ్లిక్ హియరింగ్ కార్యక్రమాన్ని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించాయి. పబ్లిక్ హియరింగ్ జ్యూరీ ప్యానెల్‌గా జస్టిస్ వీ చంద్రకుమార్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు, ఓయూ జర్నలిజం శాఖ పూర్వ ప్రొఫెసర్ విశ్వేశ్వరరావు, ప్రధాన సమన్వయకర్తలుగా ప్రొఫెసర్ మురళీమనోహర్, దేవుల సమ్మయ్య వ్యవహరించారు. పబ్లిక్ హియరింగ్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ తదితర కులసంఘాల ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే ఇంటింటి సమగ్ర కులసర్వేకు సంబంధించిన ప్రశ్నావళి అంశాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అవలంబించే ప్రామాణిక పద్ధతులను ప్రజలకు వివరించాలని ఘంటాపథంగా తెలిపారు. బిహార్‌లో నిర్వహించిన కులసర్వేలో నిర్దిష్ట విధానాలను అవలంబించకపోవడంతో పాట్నా హైకోర్టు అక్కడి రిజర్వేషన్ల పెంపు చట్టాన్ని కొట్టివేసిందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం కులగణన కోసం జారీ చేస్తున్న జీవోలకు ఒకదానితో ఒకటి పొంతన లేకుండా ఉన్నాయని, దీంతో బీహార్ తరహా ఇబ్బందులొస్తాయని పేర్కొన్నారు. పబ్లిక్ హియరింగ్‌లో వ్యక్తమైన అభిప్రాయాల నివేదికను ప్రభుత్వానికి అందజేస్తుందని దేవల సమ్మయ్య, మురళీమనోహర్ వెల్లడించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సుదర్శన్‌రావు, ప్రొఫెసర్ భాగయ్య, డాక్టర్ పృథ్వీరాజ్‌యాదవ్, సతీశ్ కొట్టె, వినోద్ కుర్వ, డాక్టర్ వేణుయాదవ్, డాక్టర్ తుల్జారాం సింగ్, డాక్టర్ విజయ్‌కుమార్, కేపీ మురళీకృష్ణ, వితోబా, నరహరి, నిమ్మల వీరన్న, సీహెచ్ ఉపేంద్ర, విజయేందర్‌సాగర్, పిల్లి రాజమౌళి, కొన్నె శంకర్ గౌడ్ , అనిల్‌కుమార్, తుమ్మనాపల్లి శ్రీనివాస్ , చింతగింజ శ్రీహరిరావు, శివశంకర్‌యాదవ్, డాక్టర్ శోపరి శంకర్, పొన్నం దేవరాజ్‌గౌడ్, సేనాపతి, సుమారు 150 కుల సంఘాల ప్రతినిధులు, వివిధ రంగాల విషయ నిపుణులు, సామాజికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

## జీతాల నిలిపివేత సరికాదు

**నిర్ణయం వెనక్కి తీసుకోవాలి: ఇరిగేషన్‌శాఖ ఏఈఈలు**

హైదరాబాద్, అక్టోబర్26 (నమస్తే తెలంగాణ): అనుమతి లేకుండా బదిలీలు పొందిన ఏఈఈ (అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్)లకు వచ్చే నెల జీతాల చెల్లింపుపై ఫైనాన్స్ డిపార్టుమెంట్ నిషేధం విధించడంపై ఇరిగేషన్‌శాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఇరిగేషన్‌శాఖ ఏఈఈలు డిమాండ్ చేస్తున్నారు. నీటిపారుదల శాఖలో పనిచేస్తున్న 500 ఏఈఈలకు ఇటీవల బదిలీలను నిర్వహించారు. బదిలీ పొందిన ఏఈఈలకు సంబంధించి వచ్చే నెల వేతనాల చెల్లింపును నిలిపివేయాలని డైరెక్టర్ వర్క్ అండ్ అకౌంట్స్ తాజాగా ఆదేశాలు జారీ చేయడం వివాదాస్పదంగా మారింది. జీవో 193 ప్రకారమే బదిలీ చేశారని, ఉద్దేశ్యపూర్వకంగా ఇంజినీర్లపై డైరెక్టర్ వర్క్స్ అండ్ అకౌంట్స్ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని ఏఈఈలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఈఆర్‌సీ చైర్మన్ శ్రీరంగారావు

## వర్సిటీ భూములను ముట్టుకోవద్దు

హైదరాబాద్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ): అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ భూములను జేఎన్‌ఏఎఫ్‌ఏకి అప్పగించొద్దంటూ నిరసనలు కొనసాగుతున్నాయి. వర్సిటీకి చెందిన పలువురు ఉద్యోగులు శనివారం నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ జేఏసీ కన్వీనర్ ప్రొ ఫెసర్ వడ్డాణం శ్రీనివాస్ మాట్లాడు తూ సమాజానికి ఎంతో మంది విద్యావంతులను అందించిన ఓపెన్ యూనివర్సిటీ పట్ల ప్రభుత్వ వైఖరి సరైనదికాదని తెలిపారు. ఉద్యోగ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ పల్లవి కాబ్డే, సెక్రెటరీ జనరల్ మహేశ్‌గౌడ్, జేఏసీ నేతలు డాక్టర్ యాకేశ్ దైద, కాంతం ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కరెంటు బిల్లు@ 1,47,222

- 8 ఏండ్ల రీడింగ్ ఒకేసారి తీసిన అధికారులు
- చెన్నూర్ సబ్ స్టేషన్ వద్ద బాధితుడి నిరసన



చెన్నూర్‌లో కరెంట్ బిల్లును చూపుతున్న బాధితుడు గట్టు సంపత్‌గౌడ్

చెన్నూర్ రూరల్, అక్టోబర్ 26: సాధారణ గృహ విద్యుత్తు వినియోగదారుడికి రూ.1,47,222 కరెంట్ బిల్లు వచ్చింది. ఈ మొత్తాన్ని ఏకకాలంలోనే చెల్లించాలని విద్యుత్తు శాఖ అధికారులు తెలుపడంతో బాధితుడు ఒక్కసారిగా కంగుతిన్నాడు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం కొమ్మెర గ్రామంలో వెలుగుచూసింది. కొమ్మెరకు చెందిన గట్టు సంపత్‌గౌడ్ 2016లో గృహ విద్యుత్తు మీటర్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. మీటర్ వచ్చినప్పటికీ నాలుగు నెలలైనా బిల్లు రాలేదు. గ్రామంలోని లైన్‌మన్‌ను అడిగితే.. ఇంకా మీటర్ ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని తెలిపాడు. అప్పటి నుంచి ఈ సమస్యపై అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. ఈ ఏడాది జూన్‌లో తనిఖీలకు వచ్చిన విజిలెన్స్ అధికారులకు, చెన్నూర్ ఏడీఈకి ఫిర్యాదు చేయడంతో మీటర్ నంబర్ వచ్చింది. జూలైలో బిల్లు తీయగా.. రూ.1,47,222 రావడంతో బాధితుడు కంగుతిన్నాడు. సమస్య పరిష్కరించాలని మూడు నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదు. బిల్లు కట్టాల్సిందేనని అధికారులు చెప్పడంతో చెన్నూర్ సబ్ డివిజన్ కార్యాలయం ఎదుట గ్రామస్థులతో కలిసి బైఠాయించి నిరసన తెలిపాడు. ఈ విషయంపై కొమ్మెర ఏఈ శ్రీనివాస్ స్పందించి బాధితుడు డీడీ తీసి ఇస్తే మీటర్‌ను చెకింగ్ కోసం పంపుతామని తెలిపారు.





ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తున్న బీసీ సంఘాల నేతలు

## ఓట్లు బీసీలవి.. సీట్లు అగ్రకులాలకా?

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య
- ఢిల్లీ జంతర్‌మంతర్‌లో ధర్నా
- జనగణనలో కులగణన చేపట్టాలని డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 26(నమస్తే తెలంగాణ): జనగణనలో కులగణన చేపట్టాలని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ నేతలు, పలువురు ఎంపీలతో కలిసి ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద శనివారం భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ పెట్టాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఓట్లు బీసీలవి సీట్లు అగ్రకులాలకా.. జనాభా ప్రకారం వాటా పంచాలంటూ నిలదీశారు. బీసీలకు ఇంకెన్ని రోజులు అన్యాయం చేస్తారని మండిపడ్డారు. 52శాతం జనాభా ఉన్న బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యంలో 14శాతానికి మించలేదంటే ప్రజాస్వామ్య స్ఫూర్తి ఎక్కడ ఉన్నదని పేర్కొన్నారు. బీసీ సంఘాల నేతలు గుజ్జ కృష్ణ, నందా గోపాల్, వీహెచ్, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, మాజీ ఎంపీ ఆనంద భాస్కర్, మాజీ ఎమ్మెల్సీలు ఆకుల లలిత, రాములు నాయక్ పాల్గొన్నారు.